మినీ కథ

# టైమెంత?

యామిజాల ఆనంద్

ఒక ముసలాయన పార్కులో సోఫా మీద ఒక్కడే కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ ఆనందిస్తున్నాడు. ఇంతలో ఆయనకి కొంత దూరంలో కూర్చుని వున్న యువకుడు లేచి వచ్చాడు.

ముసలాయన వద్దకు వెళ్ళి "టైమెంత యింది సార్" అని అడిగాడు.

ముసలాయన బదులు చెప్పలేదు. పరధ్యాన్నంగా వున్నట్టే మొహం పెట్టి కూర్చొన్నాడు.

యువకుడు ఆయనకి చెవుడేమో అనుకొని ఇంకా గట్టిగా అడిగాడు "టైమెంత యిందండీ" మరోసారి, మరోసారి చాలా సార్లు అడిగాడు.

"టైమెంతయిందండీ" అని

చివరికి విసుగుపుట్టి యువకుడు వెళ్ళిపోయాడు. ఇదంతా చూస్తూన్న మరో ఆయన ముసలాయన దగ్గరకెళ్ళి "మీకు చెముడా?" అని అడిగాడు.

"లేదు"

"మరి ఆ అబ్బాయి అడిగిందానికి జవాబు చెప్పలేదేం?"

"ఇదిగో బ్రదర్ నేను నా మానాన నేను కూర్చొంటే ఆకుర్రాడు ఎందుకు పలకరించాలి? టైం చెబుతాననుకో ఏమవుతుంది? ప్రక్కన కూచొని ఏదో మట్లాడటం మొదలు పెడతాడు! నేనేదో మాట్లాడవలసి వస్తుంది. అలా కొంచెం సేపు కబుర్లు అయిన తరువాత నేను మాయిల్లు ఇక్కడికి దగ్గరే కాఫీ కాస్త తాగి పోదువు గాని రావయ్యా అంటాను. అతను వస్తాడు! వస్తాడా?"

"వస్తాడండీ వస్తాడు"

"మా అమ్మాయి కాఫీ పట్టుకు వస్తుంది. వస్తుందా?"

"వస్తుందండీ వస్తుంది."

"అవునా! దానికి పదిహేడేళ్ళు. అప్సరసలా వుంటుంది. ఆ అమ్మాయిని వీడు చూసి చూడగానే ప్రేమించేస్తాడు. వీడు కాస్త ఎర్రగా బుర్రగానే వున్నాడు గనక మా అమ్మాయి కూడా వీణ్ణి ప్రేమించవచ్చు! వచ్చా?"

"వచ్చండీ వచ్చు"

"ఇహ వాడు నెమ్మదిగా బయట పెడతాడు. మీ అమ్మాయిని చేసుకోవాలని వుంది. అనటా అని"....అమ్మాయి కూడా అదేమాట అంటుంది. మా అమ్మాయి మాట తీసెయ్యలేక చివరికి పెళ్ళి చెయ్యక తప్పక పోవచ్చు"

"పోవచ్చు?"

"పోవచ్చండీ పోవచ్చు"

"అదుగో అక్కడే వస్తుంది చిక్కంతా చేతికి రిస్టువాచి కూడా లేనివాడికి, నా పిల్లను ఎలా ఇవ్వనూ అంటూ?" అని ముసలాయన లేచి చక్కా పోయాడు.